## క్లుప్తంగా

### పౌష్టికాహారం తీసుకోవాలి



గర్భిణులు, బాలింతలకు పాల ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న సూపర్ వైజర్ నాగేశ్వరి

గుత్తి: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగేశ్వరి సూచించారు. గుత్తి ఆర్ఎస్‌లోని హోరబ్ చర్చి ఏరియాలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు పాలు ప్యాకెట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సూపర్ వైజర్ ముఖ్య అతిథిగా హాజరై పాల ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ పాలలో ప్రొటీన్లు, విటమిన్లు అధికంగా ఉంటాయన్నారు. రోజూ కనీసం ఒక గ్లాస్ పాలు తాగాలన్నారు. బాలింతలు, గర్భిణులు పాలు తాగడం వల్ల ఆరోగ్యంగా ఉంటారన్నారు.

### నేటి నుంచి రేషన్ పంపిణీ

శింగనమల: మండలంలోని ఎండీయూ ఆపరేటర్లు శనివారం నుంచి జూన్ నెలకు సంబంధించిన రేషన్ సరుకులు పంపిణీ చేయాలని తహసీల్దార్ మోహన్‌బాబు, సీఎస్‌డీటీ రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ ఉదయం 9 గంటల నుంచి ఎండీయూ ఆపరేటర్లు నిత్యావసర సరుకులు పంపిణీ చేపట్టాలన్నారు. అలాగే చౌకధాన్యపు డిపోల్లో మిగిలిన రాగులు పంపిణీ చేయాలన్నారు.

### నేడు నీలం సంజీవరెడ్డి వర్ధంతి

గార్లదిన్నె: మండలంలోని కల్లూరులో మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి వర్ధంతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ శనివారం కల్లూరులోని నీలం సంజీవరెడ్డి సర్కిల్‌లో రాజకీయపార్టీలకు అతీతంగా మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి వర్ధంతి కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. మండలంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు.

### ఉద్యోగ విరమణ సన్మానం



వహిదా బేగంను సన్మానిస్తున్న దృశ్యం

గుత్తి: గుత్తి రైల్వే ఉద్యోగి (ఎలక్ట్రికల్ గ్రేడ్-1) వహిదా బేగం శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా రైల్వే కమ్యూనిటీ హాల్, రైల్వే డీజిల్‌షెడ్‌లో ఆమెను సన్మానించారు. ఈ సందర్భంగా ధర్మవరం, గుత్తి మున్సిపల్ వైస్ చైర్మన్లు షంషాద్ బేగం, బిందె వరలక్ష్మి హాజరై మాట్లాడుతూ వహిదా బేగం సేవలు అమోఘమన్నారు. కార్యక్రమంలో రైల్వే అధికారులు ఎస్ఎస్ఈ ఉమామహేశ్వర్ రెడ్డి, ఓఎస్ అజారుద్దీన్, ఎంసీఎంలు ఖలందర్, షాకీర్, రామాంజి, వైఎస్సార్‌సీపీ నాయకులు జీఎం బాషా, గురుప్రసాద్‌యాదవ్, నిజాముద్దీన్, గురుశంకర్, డీలర్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.


### జాగ్రత్తలు పాటిస్తే ఆరోగ్యం పదిలం



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ ఉషారాణి

పెద్దపప్పూరు: వర్షాకాలం ప్రారంభం కానున్న తరుణంలో వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలపరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని డాక్టర్ ఉషారాణి సూచించారు. శుక్రవారం మండలంలోని పసలూరు వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లో ఆమె 104 వాహన సేవల గురించి గ్రామస్తులకు వివరించారు. అనంతరం అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. అత్యవసర సమయాల్లో 104, 108 వాహన సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం శశికళ, సీహెచ్ఓ పల్లవి, 104 వాహన సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా సూపర్‌స్టార్ కృష్ణ జయంతి



మాట్లాడుతున్న చలపతి

గుంతకల్లు: స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం సూపర్‌స్టార్ కృష్ణ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు ఈట రాముడు, జీఎంవీ చలపతి, విశ్వనాథ్, అమర్‌నాథ్‌గుప్త, బషీర్ సాహెబ్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలు ప్రాణాంతకం

- మండల కేంద్రాల్లో వైద్య సిబ్బంది ర్యాలీలు
- ఘనంగా పొగాకు వ్యతిరేక దినోత్సవం



గార్లదిన్నెలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యసిబ్బంది



బుక్కరాయసముద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



యాడికిలో ప్రతిజ్ఞ చేస్తున్న డాక్టర్ పరమేశ్వర్, వైద్య సిబ్బంది

బుక్కరాయసముద్రం: మత్తు పదార్థాలు ప్రాణాంతకమని వైద్యురాలు లక్ష్మీస్వాతి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ప్రభుత్వ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ముందుగా వైద్య సిబ్బంది ప్రభుత్వాస్పత్రి నుంచి తహసీల్దార్ కార్యాలయం మీదుగా ఆర్టీసీ బస్టాండ్‌వరకూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల డాక్టర్ హాజరై మాట్లాడారు. బీడీ, సిగరెట్లు తాగడం వల్ల క్యాన్సర్ సోకే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ మోహన్ రావు, పీహెచ్ఎన్ చెన్నమ్మ, సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ, నాగలక్ష్మి, ల్యాబ్ అసిస్టెంట్ శ్రీనివాసులు, హెల్త్ అసిస్టెంట్లు ధనుంజయ, శివానంద, మిడ్‌లెవల్ ప్రొవైడర్స్, యామిని, జ్యోతి, జయంతి, వరలక్ష్మి, రాజేశ్వరి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గార్లదిన్నె: పొగ తాగడం వల్ల అనారోగ్య సమస్యలు వస్తాయని, పొగాకు ఉత్పత్తుల వాడకం మానేయాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు గౌతమి, దిలీప్ కుమార్ సూచించారు. శుక్రవారం మండల వ్యాప్తంగా గ్రామ సచివాలయాల్లో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. గార్లదిన్నెలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది పీహెచ్‌సీ నుంచి బస్టాండ్ సర్కిల్ వరకూ ర్యాలీ చేశారు. అనంతరం వైద్యులు మాట్లాడుతూ పొగాకుకు సంబంధించిన ఉత్పత్తులు సిగరెట్, గుట్కా వంటివి వాడకం వల్ల నోటి క్యాన్సర్, కాలేయ, ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు గురవుతారన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ లోక్‌నాథ్, ఆరోగ్య విస్తరణ అధికారి నాగేశ్వరయ్య, పీహెచ్ఎన్ అరుణ, హెల్త్ సూపర్‌వైజర్లు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

యాడికి: ధూమపాన రహిత సమాజం కోసం కృషి చేయాలని ప్రభుత్వ వైద్యాధికారి పరమేశ్వర సూచించారు. శుక్రవారం యాడికి పీహెచ్‌సీ ఆధ్వర్యంలోలో ధూమపాన రహిత దినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ధూమపానం వల్ల అనేక మంది కేన్సర్ బారిన పడి మృతి చెందుతున్నారన్నారు. పొగాకు వినియోగించడం వల్ల నోటి క్యాన్సర్, దంత వ్యాధులు, క్షయ, ఊపిరితిత్తుల క్యాన్సర్ వస్తాయన్నారు. పొగ తాగే వారికంటే పక్కనున్న పీల్చే వారికి ఎక్కువ ప్రమాదం ఉంటుందన్నారు. బీడీలు, సిగరెట్లు, గుట్కా, ఖైనీ వంటి వాటికి దూరంగా ఉండేటట్లు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి



పుట్లూరులో సర్వే చేస్తున్న అధికారులు

పుట్లూరు: దివ్యాంగులైన చిన్నారులు భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఐఈఆర్పీలు సుదర్శన్‌రెడ్డి, వాణిశ్రీ సూచించారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో దివ్యాగుల గుర్తింపు సర్వే చేపట్టారు. సర్వేలో గుర్తించిన దివ్యాంగులను పాఠశాలల్లో చేర్పించామన్నారు. మండలవ్యాప్తంగా 26 మంది దివ్యాంగులను గుర్తించామన్నారు.

### రేపు బహుళ ఏకాదశి పూజలు

పామిడి: పట్టణంలోని తగ్గుదేవాలయంలో ఉన్న అనంత గజగరుడ లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో ఆదివారం బహుళ ఏకాదశి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీ నారాయణస్వామికి వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. ఉదయం 7 గంటలకు విష్ణు సహస్రనామ పారాయణం ఉంటుందన్నారు. 8 గంటలకు దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలకు పల్లకీసేవ నిర్వహిస్తామన్నారు.

## హింసాత్మక ఘటనలకు దూరంగా ఉండాలి



పెద్దవడుగూరు మండలం బుర్నాకుంటలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు



పెద్దపప్పూరులో మాట్లాడుతున్న ఎస్ఐ శరత్ చంద్ర

పెద్దవడుగూరు: ప్రజలు హింసాత్మక ఘటనలకు దూరంగా ఉండాలని, అందరూ శాంతియుతంగా జీవించాలని ఎస్ఐ శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం మండలంలోని మేడిమాకులపల్లి, బుర్నాకుంట గ్రామాల్లో ప్రజలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎన్నికల సమయంలో ఎవరైనా చట్టాన్ని చేతిలోకి తీసుకొని దాడులకు పాల్పడితే అలాంటి వాటిని తీవ్రంగా పరిగణలోకి తీసుకుంటామని హెచ్చరించారు. ఏమైనా సమస్యలుంటే పోలీసుల దృష్టికి తీసుకరావాలన్నారు. ఎన్నికల కోడ్ ఎవరైనా ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. గ్రామాల్లో ప్రజలందరూ కలసిమెలసి జీవించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

**సమస్యలు సృష్టిస్తే కేసుల నమోదు**

పెద్దపప్పూరు: ఎన్నికల ఫలితాల అనంతరం విజయోత్సవాల పేరిట సమస్యలు సృష్టిస్తే ఎంతటివారినైనా ఉపేక్షించేదిలేదని ఎస్ఐ శరత్ చంద్ర హెచ్చరించారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో వివిధ గ్రామాలకు చెందిన ఇరుపార్టీల నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆధిపత్యం కోసం ఆర్భాటాలు చేస్తే మీతో పాటు మీ పిల్లల భవిష్యత్ దెబ్బతింటుదన్నారు. గ్రామాల్లో ఎటువంటి సమస్య వచ్చినా సొంత నిర్ణయం తీసుకోకుండా పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

## కౌంటింగ్ అనంతరం సంబరాలు నిర్వహించొద్దు



పెద్దపేటలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ నాగార్జున రెడ్డి



వాహనాల రికార్డులను పరిశీలిస్తున్న దృశ్యం

యాడికి: ఎన్నికల కౌంటింగ్ అనంతరం విజయోత్సవాలు నిర్వహించకూడదని సీఐ నాగార్జునరెడ్డి హెచ్చరించారు. మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని పెద్దపేట, రాయలచెరువు గ్రామాల్లో శుక్రవారం రాత్రి సీఐ నాగార్జునరెడ్డి పోలీసులతో కలసి గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో అనుమానితులుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. రికార్డులు లేని వాహనాలు కొనుగోలు చేసినా, విక్రయించినా నేరమన్నారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు సందర్భంగా సమస్యాత్మక ప్రాంతాల్లో ముందు జాగ్రత్తగా కవాతు నిర్వహించి గ్రామ సభలు నిర్వహిస్తున్నామన్నారు. ఎన్నికల ఫలితాల అనంతరం ర్యాలీలు, సంబరాలు నిర్వహించడం, టపాసులు కాల్చడం చేయరాదన్నారు. జూన్ 6 వరకూ 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. 6వ తేదీ తర్వాత సంబరాలకు, ర్యాలీలకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా పొందాలన్నారు. అలాగే ఆయన కోన రోడ్, రాయలచెరువు నగరూరు క్రాస్‌లో వాహనాల తనిఖీ చేస్తూ డ్రంక్ డ్రైవ్ నిర్వహించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## నేడు హనుమాన్ జయంతి

శింగనమల: మండల కేంద్రంలోని రంగరాయుల చెరువు కట్ట మీద ఉన్న దుర్గాంజనేయ దేవాలయంలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయకమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం అభిషేకం, పూజ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమానికి భక్తులు తరలిరావాలని వారు కోరారు.

గార్లదిన్నె: మండల కేంద్రం గార్లదిన్నె, కల్లూరు, క్రిష్టాపురం, పెనకచెర్ల డ్యాం, ముకుందాపురం యర్రగుంట్ల, పాపినే పాళ్యం,బూదేడు గ్రామాల్లో శనివారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో హనుమాన్ ఆలయాల్లో భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అలాగే స్వామికి పంచామృతాభిషేకం, తమలపాకులు, సింధూరంతో సహస్ర నామార్చన వంటి ప్రత్యేక పూజలు చేస్తున్నట్లు ఆయా గ్రామ పెద్దలు తెలిపారు.

**జయప్రదం చేయండి**

పామిడి: పట్టణంలోని తలవాలకట్ట వీధిలో ఉన్న కోట వరాంజనేయస్వామి ఆలయంలో శనివారం నిర్వహించే హనుమాన్ జయంతి వేడుకలను జయప్రదం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. ఆలయంలో ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. అలాగే సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తామన్నారు. అనంతరం అన్నదానం కార్యక్రమం ఉంటుందన్నారు. సాయంత్రం 4 గంటలకు స్వామి రథోత్సవం నిర్వహిస్తామన్నారు.

### కరువు జాబితా ప్రతిపాదనలు సిద్ధం

యాడికి: 2023 రబీలో వర్షాభావ పరిస్థితుల వల్ల జిల్లావ్యాప్తంగా ఎనిమిది మండలాలను ప్రభుత్వం కరువు ప్రాంతాలుగా ప్రకటించగా అందులో యాడికి మండలం ఉందని ఏఓ మహబూబ్ బాషా శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రబీలో వర్షాభావ పరిస్థితుల వల్ల దెబ్బతిన్న పంటలకు పెట్టుబడి రాయితీ కోసం రైతుల జాబితాను సిద్ధం చేశామన్నారు. మండలం లోని యాడికి, కుందనకోట, నిట్టూరు, వేములపాడు, తిమ్మాపురం, కమలపాడు, చందన, రాయలచెరువు, తూట్రాళ్లపల్లె, నగరూరు, పుప్పాల గ్రామాల్లోని 701 మంది రైతులు సాగుచేసి నష్టపోయిన 921.56 హెక్టార్లకు రూ.92,15,600 పెట్టుబడి రాయితీ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు.

## మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలి



పెద్దవడుగూరులో వంటలను పరిశీలిస్తున్న ఎంఈఓలు రాముడు, గురుప్రసాద్



యాడికిలో మధ్యాహ్న భోజనం తయారీపై అవగాహన కల్పిస్తున్న మాస్టర్ ట్రైనర్ రంగమ్మ

పెద్దవడుగూరు: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథక ఏజెన్సీ నిర్వాహకులు విద్యార్థులకు నాణ్యతగా భోజనం తయారు చేయాలని ఎంఈఓలు రాముడు, గురుప్రసాద్ సూచించారు. శుక్రవారం మండలకేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో ఏజెన్సీ నిర్వాహకులకు వంటల పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న మెనూ ప్రతి ఒక్కరూ తప్పకుండా పాటించాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా భోజనం ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం భోజనం తయారు చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుధాకర్‌బాబు, మస్తానప్ప, జగత్, ఎమ్మార్సీ సిబ్బంది అశోక్, సూర్యానారాయణ, సీఆర్‌పీలు రామాంజనేయులు, మల్లికార్జున, తిరుమల తదితరులు పాల్గొన్నారు.

**విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలి**

యాడికి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజ నాన్ని రుచికరంగా చేయాలని మాస్టర్ ట్రైనర్ రంగమ్మ సూచించారు. శుక్రవారం మండలంలోని రాయలచెరువు ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు భోజన తయారీ విధానంపై శిక్షణ ఇచ్చారు. ప్రభుత్వం విద్యార్థులకు ఒక్కోరోజు ఒక రకంగా మెనూ అమలు చేస్తోందని, దాన్ని పక్కగా అమలు చేయాలన్నారు. పరిసరాల శుభ్రతతో పాటు తాజా కూరగాయలు, ఆకుకూరలు నాణ్యమైన సరుకులు వాడి రుచికరంగా చేయాలన్నారు. కార్యక్రమం లో మండల విద్యాధికారి ధనలక్ష్మి, కోనుప్పలపాడు హెచ్ఎం పెద్దన్న, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

**'మధ్యాహ్న భోజన' నిర్వాహకులకు సన్మానం**

యల్లనూరు: స్థానిక ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండలంలోని 37 పాఠశాలల మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు శిక్షణ ఇచ్చారు. వంట చేయడంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 11 మంది నిర్వాహకులను మండల విద్యాధికారులు చంద్రశేఖర్, మరమేశ్వరరెడ్డి నిర్వాహకులను శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాస్టర్ పద్మావతి, హెచ్ఎం రత్నమ్మ, ఎమ్మార్సీ సిబ్బంది, మధ్యాహ్న భోజన నిర్వాహకులు పాల్గొన్నారు.

## నాయకుల ఇళ్లలో పోలీసుల సోదాలు



సోదా చేస్తున్న ఎస్ఐ శరత్‌చంద్ర, సిబ్బంది

పెద్దపప్పూరు: మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన తిమ్మన చెరువు, జూటూరు గ్రామాల్లో శుక్రవారం తెల్లవారుజామున ఎస్ఐ శరత్ చంద్ర సిబ్బందితో కలసి ఇరు పార్టీలకు చెందిన నాయకుల ఇళ్లలో సోదాలు చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా సోదాలు చేపట్టామన్నారు. అనంతరం గ్రామస్తులతో ఆయన సమావేశం నిర్వహించారు. కౌంటింగ్ అనంతరం గెలుపొందిన పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు టపాసులు పేల్చడం, ఊరేగింపులు, ర్యాలీలు చేయరాదన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఉంచామని, నిబంధనలను ఉల్లంగించిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.

## పొలం వివాదంలో ఐదుగురిపై కేసు నమోదు



రామసుబ్బమ్మ పొలంలో ధ్వంసమైన అరటి మొక్కలు



వివాదాస్పద పొలాన్ని పరిశీలించి, రైతులతో మాట్లాడుతున్న ఎస్ఐ గిరిబాబు

యల్లనూరు: భూ సమస్యపై నెలకొన్న వివాదానికి సంబంధించి ఐదుగురిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ గిరిబాబు తెలిపారు. వివరాలు.. మండలంలోని పార్నపల్లె గ్రామానికి చెందిన రైతులు బోనాసి రామలక్ష్మమ్మ, బోనాసి సరస్వతమ్మ మధ్య కొద్ది రోజులుగా భూ సమస్య నెలకొంది. ఈ నేపథ్యంలో పొలంలో అరటి మొక్కలు ధ్వంసం చేశారి బోనాసి రామసుబ్బమ్మ పోలీసులను ఆశ్రయించింది. నీర్జంపల్లె సరిహద్దులలో ఉన్న వివాదాస్పద భూమిని శుక్రవారం ఎస్ఐ గిరిబాబు పరిశీలించి అరటి మొక్కలు ధ్వంసం చేసేందుకు ఉపయోగించిన ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని, బోనాసి సరస్వతమ్మతో పాటు మరో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

### వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి



హరికృష్ణ మృతదేహానికి పూలమాల వేస్తున్న ఆలూరు రమణారెడ్డి

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త హరిక్రిష్ణ (40)అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆలూరు రమణారెడ్డి తదితరులు మృతదేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి పార్టీ తరఫున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు చికెన్ నారాయణస్వామి, ముత్యాల రంగనాథ్, జెడ్పీ మాజీ సభ్యుడు కొండన్న, పురుషోత్తం, మణి పాల్గొన్నారు.

### 30 మంది బైండోవర్

పామిడి: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జూన్ 4న చేపట్టే కౌంటింగ్‌ను పురస్కరించుకుని శుక్రవారం అన్ని రాజకీయపార్టీలకు సంబంధించి 30 మందిని పోలీసులు బైండోవర్ చేశారు. కౌటింగ్ తర్వాత అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలో భాగంగా వారిని అదుపులోనికి తీసుకున్నారు. సీఐ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ బెస్తరాజు సారథ్యంలో అదుపులోకి తీసుకున్న వారిని తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్ ఎదుట పోలీసులు బైండోవర్ చేశారు.

### ఇద్దరికి గాయాలు

బెళుగుప్ప: మండలంలోని ఎవటాద్రిపల్లి సమీపంలో ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. గుండ్లపల్లికి చెందిన చిరువ్యాపారి చాంద్‌బాషా, బెళుగుప్పకు చెందిన తిమ్మప్ప ద్విచక్రవాహనాల్లో వస్తూ వెంకటాద్రిపల్లి వద్ద ఎదురెదురుగా ఢీకొని గాయపడ్డారు.

### వివాహిత ఆత్మహత్య



మృతిచెందిన గీత

యాడికి: మండల కేంద్రంలోని ఆస్పత్రి కాలనీలో శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో ఉరేసుకుని ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. వివరాలు.. ఆస్పత్రి కాలనీకి చెందిన కరుణాకర్ ఐదేళ్ల క్రితం వజ్రకరూరు మండలం తట్రకల్లుకు చెందిన గీత(27)ను వివాహం చేసుకున్నాడు. మగ్గం నేస్తూ జీవనం చేస్తున్న వారు సంతానం కలగకపోవడంతో పలు ఆస్పత్రుల్లో చికిత్స తీసుకున్నారు. ఈ క్రమంలో మనస్తాపంతో శుక్రవారం రాత్రి గీత ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరేసుకుంది. భర్త కిందకు దించి చూడగా అప్పటికే ఆమె మృతిచెందింది. ఈ విషయంపై సీఐ నాగార్జున రెడ్డిని వివరణ కోరగా మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామన్నారు.

## ఏసయ్యను అందరూ ప్రార్థించాలి



సువార్త మహా సభలకు హాజరైన భక్తులు



ప్రసంగిస్తున్న పాస్టర్ రెవరెండ్ అద్భుత కుమార్

గుత్తి: ఏసయ్యను అందరూ ప్రార్థించాలని బైబిల్ మిషన్ చర్చి(స్వస్థత శాల) పాస్టర్లు రెవరెండ్ అద్భుత కుమార్, మణి కుమారి అన్నారు. గుత్తి బైబిల్ మిషన్ చర్చిలో మహిమ సువార్త మహాసభలు గత బుధవారం నుంచి జరుగుతున్న విషయం తెలిసిందే. మూడో రోజు శుక్రవారం మహిమ సువార్త మహాసభలు ఘనంగా ముగిశాయి. సువార్త మహాసభలకు దేశ విదేశాలకు చెందిన ప్రముఖ పాస్టర్లు, ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అద్భుత్‌కుమార్, మణి కుమారి వేలాది మంది భక్తులు, వివిధ ప్రాంతాలకు చెందిన ప్రతినిధులను ఉద్దేశించి ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా వారు ప్రసంగిస్తూ ప్రతి ఒక్కరూ ఏసయ్యపై విశ్వాసం, నమ్మకం ఉంచాలన్నారు. అందరూ ఏసు ప్రభువును ప్రార్థించాలన్నారు. ఏసయ్యపై నమ్మకం ఉన్న వారికి అంతా మేలే జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బైబిల్ మిషన్ చర్చి సభ్యులు, వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.